
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

7

గురువారం 16 అక్టోబరు 2025



మంగళగిరి బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

హాజరు కానున్న సీఎం, హోంమంత్రి.. ● భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ఉపాధ్యాయుడి సస్పెన్షన్ 8లో..

వైద్యుల సమ్మెబాట

డిమాండ్ల సాధనకు పోరుబాట పట్టిన పీహెచ్‌సీ డాక్టర్లు



సమ్మె చేస్తున్న డాక్టర్లకు మద్దతుగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

● రెండు వారాలుగా ఆస్పత్రుల్లో నిలిచిన వైద్యసేవలు

● అరకొరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు తమ డిమాండ్ల సాధనకు పోరుబాట పట్టడంతో గ్రామాల్లో వైద్యసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు వారాలుగా ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిచి పోయాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడంలేదు. ఇన్ సర్వీస్ పీజీ కోటా సీట్లు 20 శాతానికి పెంచి అన్ని స్పెషలైజేషన్ కోర్సుల్లో అమలు చేయాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్ల అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి బేసిక్‌పై 50 శాతం ప్రత్యేక భృతి, నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు తదితర డిమాండ్లను నెరవేర్చాలని పల్నాడు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులు ప్రభుత్వాన్ని కోరారు. కానీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదంటూ గత నెల 28వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. దీంతో పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. అసు పత్రికి వచ్చిన రోగులకు స్టాఫ్‌నర్సులు తమ స్థాయిలో సేవల ను అందించి మందులు ఇచ్చి పంపుతున్నారు. ఈ విషయం ప్రభు త్వం దృష్టికి రావడంతో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా వైద్యశాలల్లో పనిచేస్తున్న వైద్యుల్లో కొంతమందిని పీహెచ్‌సీలలో డిప్యూటేషన్‌పై నియ మించారు. అరకొరగా రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి. గ్రామ సచివా లయాల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలు నిలిచిపోయాయి.



ఖాళీగా డాక్టర్ చాంబర్



ప్లాస్టిక్ ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమైంది. ఉదయం నిద్ర లేవగానే పాల ప్యాకెట్లతో మొదలయ్యే ప్లాస్టిక్ వినియోగం కూరలు, పళ్లు, టిఫిన్ ఇతర వస్తువులు ఏవి కొన్నా ప్లాస్టిక్ కవర్లనే ప్రజలు వినియోగిస్తున్నారు. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా దానికి దూరంగా ఉండలేకపోతున్నారు. ప్లాస్టిక్‌ను తయారు చేసే, వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడకుండా వ్యవహరిస్తుండటంతో జిల్లాలో ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా జరుగుతోంది.

నిషేధమా అదెక్కడ?

● జిల్లాలో ఎక్కడా అమలు కాని ప్లాస్టిక్ నిషేధం

● విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు

● తనిఖీలు మరచిన అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్లాస్టిక్‌ను నిరోధించాలని అధికారులను ఆదేశిస్తోంది. డిసెంబరు నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజలు సంబంధిత అధికారులు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలోని పట్టణాలతో పాటు పల్లెల్లోనూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ఉదయం పాల ప్యాకెట్ నుంచి ప్లాస్టిక్ వినియోగం ప్రారంభమవుతోంది. ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిత్యం వేల సంఖ్యలో వినియోగిస్తున్నారు. వ్యాపారులు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్నారు. కూరగాయలు, నరుకులు, పళ్లు ఇలా ఏమి కొనుగోలు చేసినా ప్లాస్టిక్ సంచుల్లోనే ఇస్తున్నారు.

● తనిఖీలను మరిచిన అధికారులు

ప్లాస్టిక్ వినియోగంపై మునిసిపాలిటీలు, పంచాయతీలు, సచివాలయాల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. మునిసిపల్ అధికారులయితే తనిఖీలను పూర్తిగా మరిచారు. తిరిగి వాడుకునేందుకు పనికిరాని.. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌తో తయారు చేసిన పాలథిన్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఇలా 18 రకాల ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రప్రభుత్వం నిషేధం విధించింది. నిషేధిత ప్లాస్టిక్ జాబితాలో 75 మైక్రాన్ల లోపు మందం ఉన్న క్యారీ బ్యాగులతో పాటు 50 మైక్రాన్లలోపు మందం ఉన్న ప్లాస్టిక్ షీట్లు, పాన్ మసాలా ప్యాకెట్లతో పాటు మరో 18 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులను చేర్చారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, స్పూన్లు, స్ట్రాలు తదితరాలన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. నిషేధాన్ని క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అమలు చేయాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను అరికట్టడంతో యంత్రాంగం (మిగతా 8వ పేజీలో)



ప్లాస్టిక్ కవర్లలో కూరల ప్యాకింగ్

● కఠినమైన చట్టాలున్నా అమలేది..!

కఠినమైన చట్టాలు ఉన్నా వీటిని అమలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్లాస్టిక్ నిషేధిత చట్టాలను అమలు చేయటంలో అధికారులు వెనకడుగు వేస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవటం మాట ఎలా ఉన్నా ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరం. ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. ఒక వైపు చట్టాలను అమలు చేస్తూ మరో వైపు ప్రజలను చైతన్య పరిస్తే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.



నరసరావుపేటలో పంపిణీకి సిద్ధంగా ఉన్న టిడ్కో గృహాలు

టిడ్కో లబ్ధిదారులకు వైసీపీ కుచ్చు టోపి

● అసలైన వారిని మార్చి వారి కార్యకర్తలకు ఇళ్ల కేటాయింపు ● అయోమయంలో నిజమైన లబ్ధిదారులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారులకు కుచ్చుటోపీ పెట్టింది. అసలైన వారిని మార్చి ఇళ్లను తమ పార్టీ కార్యకర్తలకు కేటాయించింది. దాంతో కూటమి ప్రభుత్వం వచ్చింది సొంతింటి కల నెరవేరుతుందని ఆశపడ్డ నిజమైన టిడ్కో లబ్ధిదారుల పరిస్థితి అయోమంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నరసరావుపేట సమీపంలో 1,504 టిడ్కో గృహాల నిర్మాణం జరిగింది. లబ్ధిదారులకు గృహాల కేటాయింపు కూడా జరిగింది. అందుకు చెల్లించాల్సిన లబ్ధిదారు వాటాను మొత్తాన్ని వారు ప్రభుత్వానికి చెల్లించారు. అయితే టీడీపీ మారి వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతల కన్ను టిడ్కో ఇళ్లపై పడింది. ఈ క్రమంలో 500 మంది లబ్ధిదారులను జాబితాలో నుంచి తొలగించి వైసీపీ నేతలు వారి కార్యకర్తలకు కట్టబెట్టారు. సదరు ప్లాటుకు సంబంధించి బ్యాంకుల్లో రుణాలను చెల్లించి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో 2024లో కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత 2014లో రూ. 50 వేల నగదు చెల్లించిన లబ్ధిదారులు తమకు ఇళ్ల కేటాయింపులు జరుగుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. తీరా లబ్ధిదారులు జాబితాను పరిశీలించగా తమ పేర్లు లేకపోవడంతో అవాక్కయ్యారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దగ్గరకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే అరవిందబాబు టిడ్కో గృహాలను సందర్శించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

● 2014 లిస్టు ప్రకారమా లేక .. 2019 ప్రకారమా

గత టీడీపీ ప్రభుత్వంలో గుర్తించిన 1,504 మందికి పంపిణీ చేయనున్నారా లేక 2019 లో మార్పులు చేర్పులు చేసిన లిస్టు ప్రకారం లబ్ధిదారులను గుర్తించనున్నారా అని ప్రజలు ఆందోళనలో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సుమారు 500 మందికి ఇళ్లను అందజేసింది. వారిలో 10 శాతం మంది కూడా వాటిలో నివాసం ఉండటం లేదు. పైగా ఇతర రాష్ట్రాల వారికి, బిహారీలకు,డాన్స్‌పార్టీ ఈవెంట్‌లు నిర్వహించే వారికి అద్దెలకు ఇచ్చారు. టిడ్కో గృహాలకు రూ. 50 వేలు చెల్లించిన 198 మంది లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు ఈ నెల 23న ముహూర్తం ఖరారు చేశారు. దీంతో గత టీడీపీ హయాంలో రూ.50 వేలు చెల్లించిన వారంతా తమకు కూడా ఇళ్లను కేటాయించాలని స్థానిక టీడీపీ నేతలపై ఒత్తిడి తెస్తున్నారు.



2,143 లీటర్ల మద్యం ధ్వంసం

దాచేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి పరిధిలో ఇటీ వల పట్టుబడిన 2,143 లీటర్లు అక్రమ మద్యాన్ని బుధవారం గురజాల డీఎస్పీ జగదీష్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. నగర పంచాయతీ నడికూడి రోడ్డు రోలర్‌తో మద్యం సీసాలను తొక్కించి ఎక్స్‌క వేటర్‌తో ధ్వంసం చేశారు. ఆంధ్రా, తెలంగాణా సరిహద్దు పొందుగల పోలీసు చెక్‌పోస్టు వద్ద సాధారణ తనిఖీలో పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. ధ్వంసం చేసిన వాటిలో చీప్ లిక్కర్ నుంచి ఖరీదైన మద్యం బాటిళ్లు కూడా ఉన్నాయని, వీటి విలువ లక్షల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జగదీష్, ఈఎస్ బుచ్చి బాబు, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.

2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురి సౌత్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో అధికారులు బుధవారం 2 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 10,040, ఎడమ కాల్వ ద్వారా 6401, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,251, 2 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 16,138, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 మొత్తం ఔట్‌ఫ్లో 67,030 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 67,030 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో విద్యుదుత్పత్తి

రెంటచింతల: సత్రశాలలో కృష్ణానదిపై నిర్మితమైన టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లలో 3 గేట్లను 2.5 మీటర్లు, 1 గేట్‌ను 1 మీటరు మేర ఎత్తి 42,673 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం టీఆర్‌సీ(టేల్ రేస్ ఛానల్) ద్వారా 8447 క్యూసెక్కులు మొత్తంగా 51,120 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.9926 ఎంయూల(మిలియన్ యూనిట్లు) విద్యుత్ తయారైందన్నారు. సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 49,389 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఫణిదం హైస్కూల్‌లో డీఈవో చంద్రకళ

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): భారతరత్న అబ్దుల్ కలాంను విద్యా ర్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో చంద్రకళ తెలిపారు. మండలంలోని ఫణిదం జడ్పీ ఉన్నత పాఠ శాలలో బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు జరార్డ్ బాబు ప్రవర్తనపై ఆరాతీశారు. అనంతరం చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలకు ఇప్పటి నుంచే మనోధైర్యంతో సిద్ధమై ప్రతీఒక్కరూ మంచి మార్కులు తెచ్చుకోవాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కీచక ఉపాధ్యాయుడు జరార్డ్ బాబును మంగళారం రాత్రే సస్పెండ్ చేసినట్లు డీఈవో విలేకర్లకు తెలిపారు. ఆమె వెంట ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



ఫణిదం జడ్పీ హైస్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

గ్రంథసిరిలో ఎరువులు, పురుగుమందుల సీజ్

అచ్చంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రంథసిరిలోని శ్రీమారుతీ ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణంలో వ్యవ సాయ శాఖ, విజిలెన్స్ అధికారులు బుధ వారం తనిఖీలు చేశారు. అనుమతులు లేని రూ.3.92 లక్షల ఎరువులు, రూ.1,06,726 లక్షల పురుగు మందులను సీజ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. యజమానిపై 6(ఏ) కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన పురుగు మందులు, ఎరువులపై గుంటూరు కోర్టులో కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు.

మోదీ సభకు ఆర్టీసీ బస్సులు

● కర్నూలుకు 250 పైనే సర్వీసులు కేటాయింపు

● గుంటూరు నుంచి 180, బాపట్ల నుంచి 40 బస్సులు

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0 సభకు కర్నూలుకు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు తరలి వెళుతున్నాయి. జీఎస్టీ సంస్కరణల తర్వాత గురువారం కర్నూలులో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్న సభకు భారీగా జన సమీకరణ చేయనున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 250 పైనే ఆర్టీసీ సర్వీసులు తరలివెళ్లనున్నాయి. అదే సమయంలో సామాన్య ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాని సభకు సంబంధించి జన సమీకరణకు కండీషన్‌లో ఉన్న బస్సులు సమకూర్చాలని ఉన్నతాధికారుల నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గుంటూరు- 1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి 180 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. అలానే బాపట్ల జిల్లా నుంచి 40 సర్వీసులు ప్రధాని సభకు తరలిస్తున్నట్లు బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. పల్నాడు నుంచి కూడా అదనపు బస్సులు ప్రధాని సభకు తరలిస్తున్నారు. ఆయా బస్సులను బుధవారం రాత్రి నుంచే గమ్యస్థానాలకు చేర్చారు. నియోజక వర్గాల నుంచి జన సమీకరణకు సంబంధించి ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బస్సులను ఆయా ప్రాంతాలలో గురువారం ఉదయమే అందుబాటులో ఉంచనున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

● ఇనుమెళ్లలో భూముల పరిశీలనలో ఆర్డీవో మధులత

ఈపూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మధులత హెచ్చరించారు. మండలంలోని ఇనుమెళ్ల గ్రామంలో సర్వే నంబరు 504-15లో 8 ఎకరాలు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని ఆర్డీవోకు గ్రామ స్థులు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆ భూములతో పాటు క్వారీ లీజు భూములను పరిశీలించారు. అనంతరం ఈపూరు తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో విలేకర్లతో మాట్లాడుతూ ఇనుమెళ్లలో 504-15 సర్వే నెంబరులో 381.97 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొంత భూమిని అసైన్ చేయగా మిగతా భూమి ఆక్రమణలకు గురైందన్నారు. అసైన్ భూములు వాస్తవ లబ్ధిదారుల వద్ద ఉన్నా యా లేవా అన్న దానిపై విచారణ చేస్తామన్నారు. ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేస్తామన్నారు. సర్వే నెంబరు 504-15లో క్వారీ లీజుకు గతంలో ఏడుగురు ఈ అను మతి తీసుకుని, అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువ భూమిలో మైనింగ్ జరుగుతుందని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. క్వారీ లీజు భూమి తమదని అటవీ అధికారులు అంటున్నారని, ఆర్ఎస్ఆర్ ప్రకారం అది రాళ్లగుట్టగా ఉందన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దారు నళిని, ఫారెస్టు రేంజర్ మాధవ రావు, మైనింగ్ సర్వేయర్ రవితేజ, ఏడీ భానుకీర్తి, ఆర్ఐ పీ రామారావు తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత, తహసీల్దారు నళిని

2079 పాసు పుస్తకాలు మంజూరు

ఈపూరు మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి 2079 పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరైనట్లు ఆర్డీవో తెలిపారు. చిట్టాపురం,వనికుంట,గుండేపల్లి రెవిన్యూ పరిధిలోని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయన్నారు.



పర్యావరణాన్ని పరిరక్షించాలి

పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, మౌలిక వసతుల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌ను నవంబర్ 15 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పనులు ప్రారంభం

వేగంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ భవన నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

విద్యాశాఖ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. గత కలెక్టర్ పి.అరుణ్ బాబు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయడంతో ఆర్ అండ్‌బీ టెండర్ నిర్వహించి పనులు చేపట్టింది. ఒక ఫ్లోర్ రెవెన్యూ శాఖకు వినియోగించాలని గత కలెక్టర్ నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. విద్యాశాఖ జిల్లా కార్యాలయం ప్రస్తుతం పల్నాడు రోడ్డులోని ఎన్‌బీటీఎన్‌వీసీ కళాశాల వసతి గృహంలో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో విద్యాశాఖ కార్యాలయానికి 20 సెంట్ల స్థలం అప్పటి కలెక్టర్ మంజూరు చేశారు. అప్పటి డీఈవో వెంకటప్పయ్య వివిధ రూపాల్లో విరాళాలు సేకరించి.. సుమారు రూ.45 లక్షలు వరకు భవనం కోసం ఖర్చు చేశారు. ఈ విరాళాల వివరాలు ప్రకటించకపోవడంతో అప్పట్లో కార్యాలయ నిర్మాణం వివాదాస్పదమైంది. ఆయన ఇక్కడి నుంచి బదిలీ కావడంతో 2023 మార్చిలో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.



విద్యాశాఖ కార్యాలయ భవనం

నిషేధమా అదెక్కడ..?

(5వ పేజీ తరువాయి)

పూర్తిగా విఫలమవుతోంది. నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు సాగుతున్నా... చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.

● పర్యావరణంపై తీవ్ర ప్రభావం

పర్యావరణంపై ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాలువల్లో పూడిక తీసే సమయంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఉంటున్నాయి. ఈ కవర్ల వినియోగంపై నియంత్రణ కనిపించటం లేదు. విందు, వినోదాలలో కూడా ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ సామగ్రిని వినియోగిస్తున్నారు. చివరకు కూరలు, అహారం ప్యాకింగ్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్, కవర్లను వాడుతున్నారు. వేడి అహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడం వల్ల అవి కరిగి అహారంలో కలసిపోతూ ప్రాణ సంకటంగా మరుతున్నాయి. అలాగే పట్టణాలలో ఏ మురుగు కాలువ చూసినా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కన్పిస్తున్నాయి.మురుగు కాలువలు పూడి పోవటానికి ప్లాస్టిక్ ఒక కారణంగా ఉంది. పట్టణాలలో ప్రతిరోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలలో నాలుగో వంతు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై కేసు నమోదు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు మొదటి పట్టణ సీఐ శక్తి ఫిరోజ్ బుధవారం తెలిపారు. పట్టణంలో సెక్షన్ 30 అమలులో ఉందని, మంగళవారం అనుమతులు లేకుండా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టడంతో.. డాక్టర్ గోపిరెడ్డితో పాటు మరో 22 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



మేజర్ భరద్వాజ్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తదితరులు



మేజర్ తేజ్ భరద్వాజ్ అంతిమ యాత్రలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు

తేజ్.. అమర్‌రహే

మేజర్ భరద్వాజ్‌కు కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు

నివాళులర్పించిన కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు, ప్రజలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో యుద్ధ విన్యాసాలు చేస్తూ మరణించిన గుంటూరుకు చెందిన మేజర్ తేజ్‌భరద్వాజ్‌కు కుటుంబసభ్యులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. తొలుత ఉదయం సంగడిగుంటలోని ఆయన నివాసం వద్ద సైనిక సెరిమోని నిర్వహించారు. సంగడిగుంట, ఆర్‌అగ్రహారం మీదగా శ్రీనివాసరావుపేట, కైలాసగిరి వరకు అంతిమయాత్ర సాగింది. దాదాపు గంటసేపు సాగిన మేజర్ అంతిమయాత్రలోప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్థీవదేహంపై పూలు జల్లుతూ అమర జవాను.. అమర్‌రహే అం టూ నినాదాలు చేశారు. అనంతరం మధ్యాహ్నం శ్రీనివాసరావుతోట లోని కైలాసగిరిలో అధికార లాంఛనాలతో మేజర్ అంత్యక్రియలను పూర్తి చేశారు.

తరలివచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు

మేజర్ అంతిమయాత్రలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఆయన నివాసం వద్ద మేజర్ పార్థీవ దేహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నసీర్ అహమ్మద్, గళ్లా మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, వైసీపీ తూర్పు ఇన్‌చార్జి నూరిఫాతిమా, తూర్పు తహసీల్దారు సుభాని తదితరులు నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్‌లో తేజ్ చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. మేజర్ త్యాగం మరవలేనిదన్నారు. కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

తెనాలిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● రాత్రి 11 గంటలు దాటి రోడ్లపై తిరిగితే చర్యలు ● ఎస్పీ వకుల్ జిందాల్

తెనాలి క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో పూర్తిస్థాయిలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీగా మొదటిసారి ఆయన పట్టణ పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, నేర చరిత్ర ఉన్నవారి కదలికలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు గస్తీ, బీట్ల సంఖ్యను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలపై హింసాత్మక ఘటనలు, లైంగిక వేధింపుల కేసుల్లో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. గంజాయిపై పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై దగ్గరలోని పోలీసుస్టేషన్ లేదా 112, 1930 నంబర్లను సంప్రదించాలని సూచించారు. తెనాలి పట్టణంలో రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఒంటరిగా, గ్రూపులుగా కారణం లేకుండా రోడ్లపై తిరుగుతుంటే.. పోలీసులు విచారణ చేసి.. అవసరమైతే అదుపులోకి తీసుకుంటారన్నారు. పట్టణ పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో నూతన భవనాలు ఏర్పాటు ప్రభుత్వ పరిశీలన ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలోని రౌడీషీటర్లు, కేసుల పరిష్కారం వివరాలను ఎస్‌హెచ్‌వోలను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు. డీఎస్పీ జనార్దనరావు, పట్టణ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఉరేసుకొని వివాహిత మృతి

● చేబ్రోలు ఉప్పరపాలెంలో ఘటన ● భర్త వేధింపుల వల్లేనని ఆమె తల్లిదండ్రుల ఆరోపణ



వైజయంతి (ఫైల్‌ఫొటో)

చేబ్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం ఉప్పరపాలెంలో బుధవారం ఓ వివాహిత ఉరేసుకొని అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. భర్త వేధింపుల వల్లే తమ కుమార్తె ప్రాణాలు తీసుకుందని ఆమె తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. చేబ్రోలు ప్రాంతానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి, అదే ప్రాంతానికి చెందిన వైజయంతికి (23) నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ. 50 వేల నగదు, కొంత బంగారం కట్నంగా ఇచ్చారు. అంతేకాక ఒక సెంటు భూమి ఇస్తామని వైజయంతి తల్లి హామీ ఇచ్చినట్లు సమాచారం. వీరికి ఏడాది క్రితం ఓ ఆడశిశువు పుట్టింది. అయితే గత కొంతకాలంగా భూమి కాగితాలు తీసుకురావాలని భర్త ప్రసాద్, అత్త ఉష తరచూ వైజయంతిని వేధిస్తున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ప్రసాద్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, దాంతో తనను వేధించడం పెంచాడని వైజయంతి తన తల్లిదండ్రుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం వైజయంతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చేబ్రోలు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరనారాయణ తెలిపారు.

మంగళగిరి బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

● హాజరు కానున్న సీఎం, హోంమంత్రి.. ● భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం ఈ దఫా మంగళగిరి బెటాలియన్‌లో నిర్వహించ నున్నారు. ఈ నెల 21న రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ మేరకు బుధ వారం ఆయా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. కార్యక్రమం జరుగబోయే ప్రదేశాన్ని సమీక్షించి, భద్రతా ఏర్పాట్లు, అమరవీరుల స్తూపం, స్టేజి నిర్మాణం, పరేడ్ నిర్వహణ స్థలం, అలాగే అధికారులు, సిబ్బంది కూర్చునే ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించి, సమీక్షించారు. ప్రతీ విభాగం సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే ఈ వేడుకను గౌరవప్రదంగా, అద్భుతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ, ప్రతి అధికారి సమన్వ యంతో పనిచేయాలని, ప్రతి ఏర్పాటును జా గ్రత్తగా, సమయానికి పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే, పరేడ్ నిర్వహణలో పాల్గొనే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, కమ్యూనికేషన్, ఏఆర్, సివిల్ పోలీ సులు తదితర విభాగాలు పరస్పర సహకారంతో పనిచేసి, అమర వీరుల దినం రాష్ట్రంలో ఆదర్శప్రాయంగా నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని ఎస్పీ అన్నారు. 6వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ మురళీ, గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) రమ ణమూర్తి, సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, బెటాలియన్ కమాండ్ అధికారులు, ఇంజినీరింగ్, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి బెటాలియన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

క్వాంటమ్‌పై జిల్లా స్థాయి సైన్సు సెమినార్

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ సాంకేతికపై ఈ నెల 17న జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిఎల్. చంద్రకళ బుధవారం తెలిపారు. క్వాంటమ్ యుగ ప్రారంభం - అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై ఈ సెమినార్ ఉంటుందన్నారు. ఈ నెల 17న శంకరభారతిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. ఈ సెమినార్ నందు అన్ని యాజమాన్య పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనడానికి అర్హులని చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 5 చార్ట్స్ లేదా స్లైడ్స్ ఉపయోగించుకుని గరిష్ఠంగా 6 నిమిషాల పాటు ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన ఇద్దరిని రాష్ట్ర స్థాయి పటీ ఎంపిక చేస్తానమి చెప్పారు. వీరు విజయవాడలో 18న జరిగే సెమినార్‌లో పాల్గొంటారని తెలిపారు. 30న బెంగళూరులో జాతీయస్థాయి సెమినార్‌లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్ (9959004434)ను సంప్రదించాలన్నారు.

49,453 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,748 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,453 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,250 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	13800	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	----	---	4884	---	----
సూపర్ 10	----	----	సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15000
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15800	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

సూర్యలంక తీరంలో సూపర్ జీఎస్టీపై సైకతా శిల్పం

బాపట్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బాపట్ల మండలం సూర్యలంక తీరంలో బాపట్ల టూరిజం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించే ందుకు సైకతా శిల్పాన్ని నిర్మించారు. ఇంటర్నేషనల్ శాండ్ ఆర్టిస్ట్ బాలాజీ వరప్రసాద్ నిర్మించిన సైకతా శిల్పం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకు కలిగే లాభాలు గురించి శిల్పంలో వర్ణించడం పర్యాటకులను ఆకర్షిస్తున్నది.



సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై సూర్యలంక తీరం ఒడ్డున కళాకారుడు చిత్రీకరించిన సైకతా శిల్పం

డిజిటల్ ఇండియా మార్గదర్శిగా ఏపీ

● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి

రెంటచింతల,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో గూగుల్ సంస్థ రూ.87,500 కోట్ల పెట్టుబడితో దక్షిణ ఆసియా ఖండంలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ నిర్మించడానికి ముందుకు రావడం టెక్ విప్లవానికి నాంది అని శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెంటచింతలలో ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సిటీ ఆఫ్ డెస్టినిగా ఉన్న విశాఖ నగరం ఇకపై ఏఐ డిజిటల్ సిటీ రాజధానిగా మారనుందన్నారు. డిజిటల్ ఇండియాలో మన రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో యువతకు ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారన్నారు. గూగుల్ ఏర్పాటు కోసం మంత్రి లోకేశ్ నిరంతరం శ్రమించారని, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ సాంకేతిక పటంలో నిలబెట్టబోతున్నారని కొనియాడారు.

పెదకాకాని ఆలయ హుండీల కానుకల లెక్కింపు

● 77 రోజుల ఆదాయం రూ.36,36,324



శివాలయంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

పెదకాకాని, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం కానుకల హుండీలను తెరచి, కల్యాణ మండపంలో లెక్కించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పి. సైదమ్మబాయి వ్యవహరించారు. 77 రోజులకు గాను రూ.36,36,324, అన్నదానం హుండీ ద్వారా రూ.2,05,399, బంగారం 8.500 మి.గ్రా, వెండి 340 గ్రాములు, యూఎస్‌ఏ డాలర్లు 24, ఆస్ట్రేలియా డాలర్లు 70, కెనడా డాలర్లు 50, ఇంగ్లాండు పౌండ్లు 10 వచ్చాయని దేవస్థాన ఉప కమిషనర్ తెలిపారు.

అంబటిని మించిన బడుద్దాయి మరొకరు లేరు: కనపర్తి

గుంటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబుని మించిన బడుద్దాయి, బఫూన్ మరొకరు లేరని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి లోకేశ్‌పై కారుకూతలు కూస్తే అంబటికి బడితె పూజ తప్పదని హెచ్చరించారు. 30 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యేగా అతి కష్టమ్మీద రెండోసారి గెలుపొందిన ఆయన చరిత్ర జిల్లా ప్రజలకు తెలియంది కాదన్నారు. రేపల్లెలో ఓడిన రెండుసార్లు టీడీపీ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ అన్ని ఓట్లు కూడా అంబటికి రాకపోవడం సిగ్గుచేటన్నారు. లోకేశ్ ఓడినచోటే మళ్లీ పోటీ చేసి పులివెందులలో జగన్‌రెడ్డికి సైతం ఎప్పుడూ రాని మెజార్టీతో విజయం సాధించారన్నారు. అంబటి దెబ్బకు ఏబీసీ సైతం భయపడి.. గతంలో 25,000 ఓట్ల తేడాతో ఓడిన వారెవరూ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేయవద్దని హెచ్చరించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అంబటి పులివెందులలో తప్ప ఎక్కడ నుంచి పోటీచేసినా డిపాజిట్లు రావని వైఎస్‌తో ఏఐసీసీ పెద్దలు చెప్పిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రేపల్లె ప్రజలు తన్ని, తరిమేస్తే సత్తెనపల్లి వచ్చి పడిన ఆయనను, అక్కడ సొంత పార్టీ నేతలే తీవ్రంగా ఛీ కొడితే మళ్లీ గుంటూరు వచ్చి పడ్డాన్నారు. లోకేశ్‌పై అంబటి మరోసారి నోరు పారేసుకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కనపర్తి హెచ్చరించారు.

లారీని ఢీకొని యువకుడి మృతి

నరసరావుపేట లీగల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లారీ వెనక చక్రాల కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం పట్టణంలోని గుంటూరు రోడ్డులో చోటుచేసుకుంది. రెండవ పట్టణ సీఐ మరో వివరాల మేరకు.. కారంపూడికి చెందిన బసంతి గణేష్ (26), రాగి హనుమంతు ఆచారి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గుంటూరు వెళ్తున్నారు. కలకత్తా నుంచి నరసరావుపేట వైపు గుంటూరు రోడ్డు నుండి వేరుశనగపప్పు లోడుతో వస్తున్న లారీ వెనక చక్రాలను వారు ఢీకొట్టారు. ఈ ఘటనలో బసంతి గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతాచారికి తీవ్ర గాయాలయ్యాయి. మొదటి పట్టణ సీఐ హైమారావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని.. లారీ చక్రాల కింద ఇరుక్కున్న మోటార్ సైకిల్‌ను బయటకు తీశారు. గణేష్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సత్తెనపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జర్దార్ బాబును సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైస్కూల్‌లో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న ఆరోపణలతో ఆయనను సస్పెండ్ చేశారు. గతంలోను పలు పాఠశాలల్లో విద్యార్థినుల పట్ల ఆయన అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

వివాహిత ఆత్మహత్య

బెల్లంకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎం.నాగరిక(25)కు రాజుపాలెం మండలం అను పాలేనికి చెందిన రవితో కొద్ది నెలల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో భర్త వేధింపుల తాళలేక మనస్థాపానికి గురై ఆమె తల్లిదండ్రుల ఇంటి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. అక్కడే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

బుడగ జంగాల సమస్యలను పరిష్కరించాలి

క్రోసూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాలతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు బుడగ జంగాలు, బేడ బుడగ జంగాలు నోచుకోవటం లేదని, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని నియోజకవర్గ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం క్రోసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ప్రదర్శన నిర్వహించిన అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో బుడగజంగాలు, బేడ బుడగ జంగాలవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బైరాపట్నం రామకృష్ణ, స్థానిక సీపీఐ నాయకులు పోతుగంటి నాగేశ్వరరావు, యాదగిరి, దేవదాసు, కోటయ్య, కొండలు పాల్గొన్నారు.

నకరికల్లు పరిపాలన అధికారిగా మేకల సురేష్‌బాబు

నకరికల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారిగా మేకల సురేష్‌బాబు బాధ్యతలను స్వీకరించినట్లు ఎంపీడీవో జి.కాశయ్య తెలిపారు. జడ్పీ కార్యాలయం నుంచి పదోన్నతిపై ఆయన ఇక్కడకు వచ్చారని తెలిపారు.

అభినందన

సత్తెనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన జె.నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఎన్ఎస్‌పీ డీఈ మురళీధర్, మేనేజర్ ఎంవీ సుబ్బారెడ్డి, కంభాల శ్రీనివాస్, సుందరరావు, అనూష, దుర్గేష్, నాయకులు పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

నకరికల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న ఉదయం బుధవారం 11:30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.కాశయ్య తెలిపారు. అధికారులు పాల్గొనాలని తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 43.15 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 53,355 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. మొత్తం 37,645 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

రెంటచింతల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గోలి గ్రామంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తిరుపాలునాయక్ తెలిపారు. రూ.5040స్వాధీనం చేసుకున్నారు.

● మాచర్ల రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుకవైపు పేకాట స్థావరంపై పట్టణ పోలీసులు దాడులు జరిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని.. వారినుంచి రూ. 8,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు.

గురజాల డివిజన్ ఎస్‌జీఎఫ్ గేమ్స్ షెడ్యూల్

దుర్గి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గురజాల డివిజన్ ఎస్‌జీఎఫ్ గేమ్స్ షెడ్యూల్ విడుదలైనట్లు కోఆర్డినేటర్ బండ్ల ప్రసాద్ అన్నారు. షెడ్యూల్‌ను వివరించారు. 17న దుర్గిలో యోగా, చెస్, బ్యాడ్మింటన్, 18న దాచేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో వాలీబాల్, 21న కారంపూడి జడ్పీహెచ్‌ఎస్‌లో ఖోఖో, 22న మాచర్ల బాలబాలికల హైస్కూల్స్‌లో కబడ్డీ అండర్-14, 23న గురజాల బాలుర, బాలికల హైస్కూల్స్‌లో అండర్-17 పోటీలు జరుగుతాయన్నారు.

19న ఉచిత మెగా మెడికల్ క్యాంపు

మాచర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో ఈ నెల 19న గుంటూరుకు చెందిన లక్ష్మణ్ ఆర్థో కేర్ ఆధ్వర్యాన ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు. వివరాలకు సెల్ 63025 56406, 77993 84778లను సంప్రదించాలన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం పాదాచారుడిని ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని మండాదిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మారుపాటి సతీష్, మెగావత్ సోమ్లానాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో.. 108లో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పల్లెగుంతలో 150 విద్యుత్ స్తంభాల మార్పిడి

గురజాలటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లెగుంత గ్రామంలో బుధవారం విద్యుత్ శాఖాధికారులు 150 విద్యుత్ స్తంభాలను తీసివేసి. నూతన స్తంభాలను ఏర్పాటుచేశారు.

రోబోటిక్ సర్క్యూట్స్ డిజైన్ వర్క్‌షాప్

స్థానిక శివాని విద్యానికేతన్ పాఠశాలలో బేసిక్ రోబోటిక్ సర్క్యూట్స్ డిజైన్‌పై బుధవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రవి రోబోటిక్స్ ప్రాథమిక అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

విజయపురిసౌత్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృషితో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కాలనీ రహదారులకు రూ.5కోట్లు మంజూరయ్యాయి. బుధవారం కుడి కాలువ బయ్యారం, ఎయిర్ స్ట్రిప్ రహదారి పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులను జలవనరుల శాఖ ఈఈ రమేష్, డీఈ స్వరూపరాణి, జేఈ హిమబిందు పరిశీలించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

పెదకూరపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న రాయపూడి సాంబశివరావు, బొర్రా హిమనీలకు పెదకూరపాడులోని మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఘనసన్మానం జరిగింది. బెల్లంకొండ రామగోపాలరావు, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, యూటీఎఫ్ ప్రతినిధులు, హెచ్ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించటంతో మనస్థాపం చెంది బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి బాలిక (15) తల్లికి ఇంటి పని, పొలం పనిలో సహకారం అందించటం లేదు. దీంతో తల్లి, కుమార్తెను మందలించింది. కుమార్తె ఇంట్లో ని ఒక గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది. రాత్రి 11 గంటలైనా కుమార్తె తలుపు తీయకపోవటంతో తల్లికి అనుమానం వచ్చిం ది. తలుపు గడియ తీయగా కుమార్తె ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కన్పించింది. కుటుంబసభ్యులు ఆమెను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. రూరల్ పోలీసులు ఈ సంఘటనపై బుధవారం విచారణ చేపట్టారు.



డ్రోన్ల పనితీరును రైతులకు వివరిస్తున్న అధికారులు

80శాతం సబ్సిడీపై డ్రోన్లు మంజూరు

పిడుగురాళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం, గుత్తికొండ గ్రామాల రైతులకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీపై డ్రోన్లు మంజూరు చేసినట్లు ఏవో సంధ్యారాణి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆమె మాట్లాడుతూ రైతులు సాంకేతికతను జోడించి సమయాన్ని ఆదా చేసుకొని ఖర్చులు తగ్గించుకోవడానికి డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు. అధికారులు డ్రోన్ల పనితీరును రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, పిడుగురాళ్ల మార్కెట్‌యార్డు చైర్మన్ వీరస్వామి, సర్వేశ్వరరావు, ముప్పాళ్ల సాంబయ్య, ఎడ్లపల్లి శివన్నారాయణ, డ్రోన్ కంపెనీ జోనల్ మేనేజర్ పవన్, గుత్తికొండ, వీరాపురం వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు



పిడుగురాళ్ల: నినాదాలు చేస్తున్న టీడీపీ నేతలు

అచ్చంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గూగుల్ సంస్థ వైజాక్‌కు రావడం వెనుక సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిరంతర కృషి ఉందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గుగూల్ సంస్థను వైజాగ్‌లో నెలకొల్పటం వల్ల ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయన్నారు. ప్రపంచ దేశాల్లో అమెరికా తరువాత అతి పెద్ద గుగూల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటుచేయటం శుభ పరిణామమన్నారు.

గుగూల్ రాకతో సర్వతో ముఖాభివృద్ధి

సత్తెనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గుగూల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తెస్తున్నారన్నారు. 12 నెలలపాటు శ్రమించి నేషనల్ పాలసీల్లో కూడా మార్పులు చేయించి రెండు లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు గుగూల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావటంలో మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమన్నారు.

వెల్‌కం గూగుల్ - థాంక్యూ లోకేశ్ అన్న..

పిడుగురాళ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యరపతినేని నిఖిల్ ఆదేశాల మేరకు గురజాల నియోజకవర్గ ఐటీడీపీ ఆధ్వర్యాన గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నంకు రానున్న సందర్భంగా పిడుగురాళ్లలో టీడీపీ కార్యాలయం వద్ద హర్షం వ్యక్తం చేశారు. వెల్‌కం గూగుల్ - థాంక్యూ లోకేశ్ అన్న అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ జరిపారు. ఐలాండ్ సెంటర్లో నారా లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కూటమి నేతలు చెన్నారావు, శ్రీను, సర్వేశ్వరరావు, హరి, శ్రీను, సైదా, ఆంజనేయులు, సుబ్బయ్య, బాబావలి, నాగేశ్వరరావు, ఇంతియాజు, డేవిడ్, అమీర్ అలీ, రామకృష్ణ పాల్గొన్నారు.

భారత జాతి గర్వించదగ్గ వ్యక్తి అబ్దుల్ కలాం



అమరావతి: కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



మాచర్ల: కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు



క్రోసూరు: అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్

సత్తెనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో బుధవారం అబ్దుల్‌కలాం జయంతిని టీడీపీ నేతలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎలినేడి రామస్వామి పాల్గొన్నారు. మస్తాన్‌వలి, నూర్‌బాషా జాన్‌బాబు, పి.ఆంజనేయులు, రాంబో బుడే, ఎం.స్వామి, జి.లోకేశ్వరరావు, జి.శ్రీనివాస్, పూజల వెంకటకోటయ్య, ముస్తఫా, చుక్కపల్లి శ్రీనివాసరావు, మామిడి వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వర్లు, ఎం.మల్లేశ్వరరావు పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు.

● అమరావతి: తహసీల్దార్ డానియెలు స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో జరిగిన కలాం జయంతి వేడుకలలో ఎంపీడీవో పార్వతి, ఎంఈఓ ప్రసాద్, శివబాబు పాల్గొన్నారు. కలాం విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.

● పిడుగురాళ్ల: పట్టణంలోని కేఎస్ఆర్ విద్యాసంస్థల్లో బుధవారం అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్‌రావు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: తాళ్ళచెరువులోని ఆర్‌సీఎం పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు జరిగాయి. గ్రామంలోని బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి.. విజేతలకు స్నేహహస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శౌరిరెడ్డి, ఏఎన్ఎం, డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.

● క్రోసూరు: మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్ క్రోసూరు జడ్పీహైస్కూల్‌లో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పించారు. డైరెక్టర్ డి.యోహాన్, మైసూర్‌బాబు, టీడీపీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎం బాబూరావు పాల్గొన్నారు.

● బెల్లంకొండ: బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీత అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్ ప్రెసిడెంట్ సందాని పాల్గొన్నారు.

● రెంటచింతల: ట్రైబల్‌వెల్ఫేర్ స్కూల్, సాగరమాత జూనియర్ కళాశాలలో కలాం చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఎలిషారాజ్ పాల్గొన్నారు.

● మాచర్ల: మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ స్థానిక వీవీఎస్ గార్డెన్స్‌లో జరిగిన అబ్దుల్‌కలాం జయంతి, అబ్దుల్ కలాం సేవాసమితి పదో వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలాం విగ్రహానికి నివాళులర్పించారు. మాచర్ల, గురజాల మున్సిపల్ చైర్మన్లు మదార్‌సాహెబ్, బడేజాని, ప్రభు, రామకృష్ణారావు, కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, సుశీల్ జాషువా, కరిముల్లా, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, బత్తుల దుర్గారావు, డాక్టర్ శాంతిబాయి, ఆయేషా సుల్తానా, బృంగా రమణ, ఆంజనేయులు, నాగూర్‌వలి పాల్గొన్నారు.

● పెదకూరపాడు: పెదకూరపాడులోని జన చైతన్య సమితి కార్యాలయంలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. జడ్పీ హైస్కూల్‌లో కలాం జయంతి నిర్వహించారు.



బెస్ట్ క్వాలిటీ అవార్డు అందుకుంటున్న శ్రీచక్ర సిమెంట్స్ ప్రతినిధులు

శ్రీచక్ర సిమెంట్స్‌కు బెస్ట్ క్వాలిటీ అవార్డు

కారంపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కారంపూడి శివారులోని శ్రీచక్ర సిమెంట్స్‌కు బెస్ట్ క్వాలిటీ అవార్డు దక్కింది. గత 40ఏళ్లుగా సిమెంట్స్ రంగంలో వినియోగదారులకు నాణ్యమైన సిమెంట్‌ను అందిస్తూ పేరుప్రఖ్యాతులు దక్కించుకోవడంతో వరల్డ్ స్టాండర్డ్‌డే సందర్భంగా మంగళవారం విజయవాడలో భారతీయ ప్రామాణికసంస్థ నుంచి ఈ అవార్డును శ్రీచక్ర ప్రతినిధులు అందుకున్నారు.

టీసీ ఇవ్వమంటే డబ్బులు అడుగుతున్నారు

● నకరికల్లు కేజీబీవీపై ఇంటర్ బాలిక ఆరోపణ

నకరికల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నకరికల్లు కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న నకరికల్లుకు చెందిన బెల్లంకొండ గాయత్రి టీసీ ఇవ్వాలని కోరటంతో డబ్బులు చెల్లిస్తేనే ఇస్తామని ప్రిన్సిపల్ చెపుతున్నారని బుధవారం ఆరోపించింది. పాఠశాలలో భోజనం సరిగా లేకపోవటంతో తాను అనారోగ్యానికి గురైనట్టు తెలిపింది. ఇంటర్ విద్యార్థులకు రెండు మరుగుదొడ్లను మాత్రమే కేటాయించారని, వేరే మరుగుదొడ్లను ఉపయోగించటానికి ఒప్పుకోవటం లేదని ఆరోపించింది. రెండు మరుగుదొడ్లను 40మందికి పైగా విద్యార్థులు ఉపయోగించటం ఇబ్బందిగా ఉందన్నారు. 350మంది పిల్లలు ఉన్న ఈ పాఠశాలలో పది మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, ఇవి అపరిశుభ్రంగా ఉండటం వల్ల తరచూ వ్యాధులబారిన పడాల్సివస్తుందని గాయత్రి పేర్కొంది. హాస్టల్‌లో ఉండలేనని, తనకు టీసీ ఇవ్వాలని కోరటంతో డబ్బులు చెల్లిస్తేనే టీసీ ఇస్తామని చెప్పటంతో తన తండ్రితో కలసి వీడియోను మీడియాకు విడుదల చేసింది. విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గాయత్రి పేర్కొంది.

వరిలో ఆకు ఎండు తెగులుకు నివారణ చర్యలు చేపట్టాలి

నకరికల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిరుపొట్ట దశలో ఉన్న వరిలో ఆకు ఎండుతెగులు లక్షణాలు కన్పిస్తున్నాయని ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా శాస్త్రవేత్తలు డాక్టర్ బీవీ సత్యగోపాల్, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం నాగేష్ అన్నారు. ఆకు ఎండు తెగులు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. గుండ్లపల్లిలో వరిపైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో కే దేవదాసు, వ్యవసాయ సహాయకులు యూ ప్రియదర్శిని, సుశీల పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీ సత్యగోపాల్, కో-ఆర్డినేటర్ ఎం నగేష్, వ్యవసాయ అధికారి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

కారంపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి తనిఖీచేశారు. ఓపీ రికార్డు, ఫార్మసీ రూంలో ఈహెచ్‌ఆర్ వివరాలు, లేబరేటరీ పరీక్షలను పరీక్షించారు. ఆడబిడ్డలను రక్షించు.. చదివించు ప్రోగ్రాం గురించి వివరాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలోని నేలవాగు, గరికపాడు ఉప కేంద్రాల్లో వ్యాధినిరోధక టీకాలు గురించి తెలుసుకున్నారు. ప్రధాని జనఆరోగ్యయోజన ఈకేవైసీ వర్క్ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.హనుమకుమార్, సీహెచ్‌వో కె.మల్లయ్య, ఉషారాణి, ఫార్మాసిస్ట్ శివశంకర్, వెంకటలక్ష్మి, లాలునాయక్, రమాదేవి, అపర్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రవి

ఉపాధిహామీ శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి

మాచర్ల రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ శ్రామికులకు ఈకేవైసీ తప్పనిసరి అని గురజాల ఏపీడీ జీ.సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 22వేల మంది ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ చేయవలసి ఉండగా ఇప్పటివరకు 14వేల మందికి చేశామన్నారు. నీటిసంరక్షణ పనులు, ఫారంపాండ్‌లు, సోక్ పిట్స్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, జేఈ గోపి పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏపీడీ సత్యనారాయణ

జీఎస్టీ 2.0తో పర్యాటకరంగం అభివృద్ధి

అమరావతి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర పర్యాటక, ఆతిధ్య రంగాల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని ఎంపీడీఓ పార్వతీ అన్నారు. బుధవారం అమరావతిలోని పర్యాటకకేంద్రాల వద్ద జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ జిల్లా అధికారి నాయుడమ్మ, అమరావతి శాఖ మేనేజర్ మణికుమార్, వెలుగు సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరావతి: ప్రదర్శన చేస్తున్న అధికారులు

● క్రోసూరు: జీఎస్టీ 2.0పై ప్రజలు అవగాహన కలిగిఉండాలని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం క్రోసూరులో జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు మొగల్‌జాన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, అనుముల వెంకటరామిరెడ్డి తదితరులు మాట్లాడారు. ఎన్‌డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గించటం ద్వారా ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు, వ్యవసాయ, విద్యా, వ్యాపారరంగాల వారికి జీఎస్టీ తగ్గింపు వల్ల అధిక ప్రయోజనం కలుగుతుందన్నారు. ర్యాలీలో నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు తోక వెంకటరరావు, గుడిపాడు బాషా, షేక్ సలాం, దుద్దుల యోహాన్, చిలకా రవి, కే సతీష్, డీ సాంబశివరావు, రామాంజమ్మ పాల్గొన్నారు.

● పెదకూరపాడు: మండలంలోని జలాలపురం, కంభంపాడు, పరస గ్రామాల్లో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌పై టీడీపీ నాయకులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి బి.ఆంజనేయులు, బీ రామగోపాలరావు, జి.బాబూరావు, ముంతాజ్, వెంకటసత్యనారాయణ, కృష్ణవేణి, కృష్ణకుమారి, అరవింద్, వెంకటరావు, బాబూరావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నకరికల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య ప్రాధాన్యతను గుర్తించి గ్రీన్ అంబాసిడర్లు, షెడ్‌మిత్రలు పనిచేయాలని ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లకు, షెడ్‌మిత్రలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. టీవోటీ నర్రమమత గ్రామంలో క్లీన్‌గ్రీన్ ప్లాస్టిక్‌వ్యర్థాల నిర్వహణపై పారిశుధ్యకార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలోసురేష్, పీఎస్‌లు అప్పారావు, మల్లికార్జునరావు, అబ్దుల్‌అలీం, జూనియర్ అసిస్టెంట్, ప్రసాదు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

● క్రోసూరు: క్రోసూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం టీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంపై క్లాప్‌మిత్రలకు, షెడ్‌మిత్రలకు, సీఆర్‌పీలకు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో రవికుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు, అంటు వ్యాధుల నిరోధానికి క్లాప్‌మిత్రలు, షెడ్‌మిత్రల ప్రాముఖ్యత ఎనలేనిదన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్‌లపై మండలంలోని హరిత రాయబారులకు, షెడ్‌మిత్రలకు బుధవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతను పెంపొందించటంలో హరిత రాయబారుల పాత్ర కీలకమని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. పారిశుధ్యం, పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చలంచర్ల శ్రీనివాసరావు, కాల్వపల్లి అంజిరెడ్డి, చిలువూరి కృష్ణ ప్రసాదులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించారు.



నకరికల్లులో పాల్గొన్న ఎంపీడీవో జీ కాశయ్య, శిక్షణ ఇస్తున్న టీవోటీ మమత

గ్రామాల పరిశుభ్రత బాధ్యత క్లాప్ మిత్రలదే

ఎంపీడీవో విష్ణు చిరంజీవి

మాచవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రత బాధ్యత ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్రలదేనని ఎంపీడీవో విష్ణు చిరంజీవి స్పష్టం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల క్లాప్ మిత్రలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మీ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



మాచవరంలో ప్రపంచ హ్యాండ్ వాష్ డే నిర్వహిస్తున్న దృశ్యం

● పరిశుభ్రత పాటిస్తూ మీమీ ఆరోగ్యాలను కాపాడుకోవాలని, అప్పుడే ఆయుష్ ప్రమాణం పెరుగుతుందని ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలిపారు. బుధవారం ప్రపంచ హ్యాండ్ వాష్‌డే సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఆహార పదార్థాలు తీసుకొనే ముందు తప్పనిసరిగా హ్యాండ్‌వాష్ చేసుకోవాలని, తద్వారా అనారోగ్యాలకు గురికాకుండా ఉండవచ్చన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏవో ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు, అసిస్ట్ ఐటీసీ కో-ఆర్డినేటర్ అనీల్‌కుమార్, సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఏఏలు పాల్గొన్నారు.



తిరుమలలో శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు

తిరుమల శ్రీవారిని సందర్శించుకున్న కన్నా

సత్తెనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని, తిరుచనూరు పద్మావతి అమ్మవారిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ నేతలతో కలసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దరువూరి నాగేశ్వరరావు, చౌట శ్రీనివాసరావు, జవ్వాజి రామ్మోహనరావు, కటకం రామకృష్ణ, అప్పారావు, వెంకటేశ్వర్లు, చౌట సుజాత, రామాంజనేయులు, శ్రీనివాసరావు, జానకి రామారావు, పీ నరసింహారావు తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు అంతరాయం

● కొనసాగుతున్న వైద్యుల సమ్మె

సత్తెనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో వైద్యసేవలకు అంతరాయం కలుగుతోంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసినప్పటికీ రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందటం లేదు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు ఇన్‌చార్జ్ సర్వీస్, పీజీ కోటా సీట్లు 20శాతానికి పెంచి అన్ని స్పెషలైజేషన్ కోర్సుల్లో అమలుచేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు తదితర డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళన బాటపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీల నుంచి రోగులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు పంపుతున్నారు.

బాలల ఆరోగ్యానికి ప్రాధాన్యం

రాష్ట్రీయ బాల స్వాస్థ్య ప్రోగ్రాం జిల్లా అధికారి స్వర్ణ రాజేశ్వరి

నకరికల్లు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బాలల ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య ప్రోగ్రాం జిల్లా అధికారి స్వర్ణ రాజేశ్వరి తెలిపారు. బుధవారం కుంకలగుంట పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆర్‌బీఎస్‌కే సర్వేపై సమీక్ష నిర్వహించారు. సర్వేలో వెనుకబడి ఉన్న సచివాలయాలను సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే సర్వేను నవంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు వారికి కేటాయించిన లాగిన్‌లలో సర్వేను పూర్తి చేయాలన్నారు. పుట్టకతో వచ్చే జన్యులోపం 4-డీ సంబంధిత వ్యాధులను గుర్తించి ఆ పిల్లలను నరసరావుపేటలోని డైక్ కేంద్రంలో శస్త్రచికిత్స జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం పూజాశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి కే వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్ వైజర్లు షేక్ కరిముల్లా, రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎ శాంతకుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కుంకలగుంట పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య ప్రోగ్రాం జిల్లా అధికారి స్వర్ణ రాజేశ్వరి

గజాపురంలో డీడబ్ల్యూఎంఏ పీడీ పర్యటన

దుర్గి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజాపురంలో బుధవారం జిల్లా నీటియాజమాన్య సంస్థ సంచాలకుడు ఎం సిద్ధలింగమూర్తి పర్యటించారు. ప్రభుత్వ సంస్థలలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణం గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కొరటా మల్లికార్జునరావు, టీఏ గోవింద్‌నాయక్, బీఎఫ్‌టీ శిరీష తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న లింగమూర్తి

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

సత్తెనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బుధవారం సీపీఆర్‌పై సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు నర్సింగ్ సిబ్బందికి, రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా శ్వాసలో ఇబ్బంది కలిగినప్పుడు, హృదయ స్పందన ఆగినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సీపీఆర్ అంటే తిరిగి బతికించటం అన్నారు. సీపీఆర్ పద్ధతులను గురించి వివరించారు. వైద్యులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు గిరిరాజు, కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్‌నర్స్ మాధవిదేవి, నర్సింగ్ స్టూడెంట్స్, రోగులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో సీపీఆర్‌పై సదస్సులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

● క్రోసూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను రక్షించటంలో సమయానుకూలంగా వ్యవహరించటానికి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి డాక్టర్ గఫ్రూన్ అన్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యసిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఏ పరిస్థితుల్లో సీపీఆర్ చేయాలో అవగాహన కల్పించారు. ప్రజలందరూ ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు దీనిగురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశ్యామ్‌సన్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష

గురజాలటౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కార్తీకమాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలైన దైద, గుత్తికొండ బిలంకు భక్తులు తరలిరానున్నారు. భద్రతా చర్యలపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం సమావేశం నిర్వహించనున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పరిపాలనాధికారిగా పద్మజారాణి బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పద్మజారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వట్టిచెరుకూరు మండలపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా నియమితులయ్యారు. కార్యాలయంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను మర్యాదపూర్వకంగా కలసి నియామకపత్రాన్ని అందజేసి విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన పద్మజారాణిని కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

కోత ముక్క ఆడుతున్న ఆరుగురి అరెస్టు

చిలకలూరిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామ పొలాలలో కోత ముక్క ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం చిలకలూరిపేట రూరల్ పీఎస్ఐ ఆర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో దాడిచేసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,100 స్వాధీనం చేసుకున్నారు. నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేశారు.

నియోజకవర్గ కళాకారుల సమావేశం

వినుకొండ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి కళా పీఠం ఆధ్వర్యంలో నియోజకవర్గ కళాకారుల సమావేశం స్థానిక జాషువా కళా ప్రాంగణంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకులు గుమ్మడి మాట్లాడుతూ కళాకారులందరూ ఐక్యంగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవడంలో ముందుండాలని కోరారు. కళాకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కళాకారులు 50మంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే శిశువుకు, తల్లికి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో శాంతకుమారి తెలిపారు. స్థానిక స్త్రీ శిశు సంక్షేమ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో సీడీపీవో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేముల పాండు, నల్లపాటి చిన్నబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సీహెచ్ మారుతి శ్రీనివాసరావు జాతీయ స్థాయి యోగాసన పోటీలలో తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఈ పోటీలు జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా మారుతి శ్రీనివాసరావును కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్ బాబు, తదితరులు అభినందించారు..

● నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్‌డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల కలాం జయంతి సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన ఇన్నోవేషన్ డే వేడుకల్లో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, మాల్‌టెకి సొల్యూషన్స్ సీఈవో కె.మధుకిరణ్ పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ ఇన్నోవేషన్ డే సందర్భంగా జాతీయ స్థాయి ఐడియా హ్యాకథాన్ బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నరసరావుపేట జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, గుంటూరు టెక్సారా లిమిటెడ్ సీఈవో కే అశోక్‌బాబు, హైదరాబాద్ ఏఎఫ్‌వో కన్సల్టెన్సీ ఫౌండర్ వీ ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు. ఐడియా హ్యాకథాన్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, చైర్మన్ మీరావలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: ఎంఏఎం పీజీ కళాశాలలో బెంగుళూరుకు చెందిన క్యాప్టైడర్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ బుధవారం ప్రత్యేక క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలను అంచనా వేసేందుకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి పదిమంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు, కళాశాల డైరెక్టర్ దరుపూరి శ్రావ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జే రవిశంకర్, నవీన్, సితార, తదితరులు ప్రశంసించారు.

● శావల్యాపురం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు క్లాప్‌మిత్రలు అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. థీమ్-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 15గ్రామ పంచాయతీల్లోని క్లాప్‌మిత్రలకు బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్లోబల్ హ్యాండ్‌వాష్‌డేలో భాగంగా క్లాప్‌మిత్రలకు చేతులుకడుక్కొనే విధానంపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి పద్మజారాణి, రిసోర్స్‌పర్సన్ అరుణభారతి, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఐటీసీ అసిస్ట్ ఏసోబు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: కార్మిక సమస్యలను పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు విమర్శించారు. కార్మికుల వివిధ సమస్యల పరిష్కారానికి నవంబరు 3వ తారీకు నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నారని సమ్మె నోటీసుని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు బుధవారం అందజేశారు.

● నరసరావుపేట రూరల్: జీఎస్‌టీ 2.0 తో కలగనున్న ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహిస్తున్నట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి రవాణా శాఖ కార్యాలయం దాకా ర్యాలీ జరుగుతుందన్నారు.

ఏపీజే అబ్దుల్‌కలాంకు ఘన నివాళి


అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్, పార్టీ శ్రేణులు నివాళులర్పించారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట శాఖ గ్రంథాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ, కామినేని రామారావు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని కలాం చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

● శావల్యాపురం: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని జడ్పీ పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

● వినుకొండ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో అబ్దుల్ కలాం చిత్రపటానికి జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు టీడీపీ నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం ఒక గొప్ప శాస్త్రవేత్త అని, మిస్సైల్ మ్యాన్‌గా ప్రసిద్ధి చెందారని తెలిపారు. శాస్త్రవేత్తగా భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థలలో పనిచేసి ఎనలేని సేవలు అందించారన్నారు. భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా దేశానికి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తదితరులు

గూగుల్‌తో ఒప్పందం రాష్ట్రాభివృద్ధికి దోహదం

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి గూగుల్ కంపెనీతో ఒప్పందం దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఢిల్లీలో 15 బిలియన్ల డాలర్ల ఒప్పందం జరిగిందన్నారు. దీనివలన ఎన్నో దేశాలతో సముద్రం కింద కేబుల్స్ వేయడానికి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని అన్నారు. నారా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ గడచిన సంవత్సరం నుంచి దీనిమీద పూర్తిగా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ, నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌కు రుణపడి ఉంటామన్నారు. రాజనీతిజ్ఞుడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అందరూ అభిమానిస్తున్నారని చెప్పారు. అక్రమంగా నకిలీ మద్యం తయారు చేయించి వైసీపీ నేతలు బార్‌లలో విక్రయిస్తున్నారని, బాధ్యులైన వైసీపీ నాయకుల మీద చర్యలు తీసుకుంటామని చెప్పారు. నరసరావుపేట వైసీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రోడ్డు మీద ధర్నా చేస్తున్నారని, మొన్నటి దాకా క్వార్టర్ మందుకు వైన్‌షాపులు, బార్‌లలో రూ.20లు తీసుకున్నాడని విమర్శించారు. గోవా మద్యం వైన్స్ షాప్‌లలో అమ్మించి కొన్ని వందల కోట్లు అక్రమంగా సంపాదించాడన్నారు. భూకబ్జాలు చేశారన్నారు. ఇంకా సిగ్గుఎగ్గులేకుండా బజారుల వెంట తిరుగుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, కొట్టా కిరణ్, వార్డు సెక్రటరీ షేక్ బచ్చే మస్తాన్, వీరాంజనేయులు, తవ్వా వీరాంజనేయులు, బింగి భరత్, ఎం.పుల్లారావు, షేక్ ముస్తాఫా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు.. రూ.5.66 లక్షల అపరాధ రుసుం వసూలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నరసరావుపేట మండలం పరిధిలోని ఉప్పలపాడు, చింతలపాలెం, అరవపల్లి, అల్లూరివారిపాలెం, అచ్చమ్మపాలెం, దొండపాడు, గోనెపూడి, ఇక్కుర్రు, జొన్నలగడ్డ, కాకాని, కేశానుపల్లి, కోటప్పకొండ, కొత్తపాలెం తదితర గ్రామాలలో 53మంది విద్యుత్ శాఖ అధికారులు, 159మంది సిబ్బంది 53మంది బృందాలుగా ఏర్పడి 4219 విద్యుత్ సర్వీసులను పరీక్షించినట్లు విజిలెన్సు డీపీఈ ఎస్‌ఏ కరీమ్ తెలిపారు. తనిఖీలలో మీటరులేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 24మందిపై రూ.35వేలు, మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 9మందిపై రూ.1.30లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ఐదుగురిపై రూ45లక్షలు, అదనపు లోడు వాడుతున్న 81మందిపై రూ.3.54లక్షలు మొత్తం రూ. 5.66లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఆపరేషనల్ డీఈఈ జీఎల్‌వీ ప్రసాదరావు, విజిలెన్సు డీఈఈ ఎస్. శ్రీనివాసరావు, కె. రవికుమార్, ఎన్.మల్లికార్జునప్రసాద్, ఏఈ రాంబాబు, కె.కోటేశ్వరరావు, ఎం. సతీష్‌కుమార్, యు.శివశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్లోబల్ హ్యాండ్ వాష్ డే


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్

వినుకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా పట్టణంలోని గీతాంజలి స్కూల్‌లో హ్యాండ్ వాష్, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ చేతుల శుభ్రత అలవాటుతో 80శాతం రోగాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో గీతాంజలి స్కూల్ డైరెక్టర్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాల హెచ్‌ఎం రవినాయక్ బుధవారం తెలిపారు. గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మహిళలను దూషించి.. కప్పిపుచ్చుకునేందుకే బొల్లా ఆరోపణలు: మక్కెన

వినుకొండ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆ అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకు నిరాధారమైన ఆరోపణలు చేయటం సిగ్గుచేటని జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మక్కెన మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు నోటికి వచ్చినట్టు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద మీడియాతో మహిళలను కించపరిచేలా మాట్లాడి మహిళలకు క్షమాపణ చెప్పకుండా నా మాటలను టీడీపీ వాళ్లు వక్రీకరించారని అనటం నీచమైన చర్య అన్నారు. నేను చేపల వ్యాపారం చేస్తున్నానని, సొసైటీ బైలా ప్రకారం పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్నానన్నారు. నోటికి వచ్చినట్టు విమర్శలు చేస్తే సహించేది లేదని బొల్లా బ్రహ్మనాయుడును మక్కెన హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నేల ఆరోగ్యం మెరుగు: ఏవో అరుణ

రొంపిచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వాడకంతో భూమి ఆరోగ్యం పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్ర ఏవో అరుణ బుధవారం తెలిపారు. మండలంలోని తుంగపాడులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భూమి ఆరోగ్యం, భూసారంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువుల తయారీ గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో శివ లలిత, వీఏఏ సాయినాథ్, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలన్నదే జగనన్న ధ్యేయం: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద విద్యార్థులందరికీ వైద్య విద్య అందించాలన్నదే మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు నిర్మాణం ప్రారంభించారని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు చేపడుతున్న కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఖాజావలి మాస్టారు, జడ్పీటీసీ చిట్టిబాబు, మోరబోయిన శ్రీనివాసరావు, వెంకటప్ప రెడ్డి, మోరే రవీంద్రారెడ్డి, వాసిరెడ్డి, కరిముల్లా, పి.శివారెడ్డి, ఎ.పున్నారెడ్డి, గాబ్రేలు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న నలుగురికి బైండోవర్

రొంపిచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులకు తహసీల్దార్ బండి నిర్మల వద్ద బుధవారం బైండోవర్ చేశారు. బుచ్చిపాపన్నపాలెం, అలవాల, తుంగపాడు, మత్తనపల్లి గ్రామాల్లో సుంకం చెల్లించని మద్యాన్ని అమ్ముతున్నందుకు గాను వీరిని బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రాజకీయ ఒత్తిళ్లతో విజిలెన్స్ నివేదిక.. సబ్ కాంట్రాక్టర్ సురేష్

నాదెండ్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెంలో చేసిన అభివృద్ధి పనులపై వైసీపీ వారు కక్షపూరితంగా విజిలెన్స్ విచారణ జరిపి కాంట్రాక్టర్ పేరును బ్లాక్ లిస్టులో పెట్టించారని, కాంట్రాక్టర్‌కు డబ్బు చెల్లించకుండా అడ్డుకున్నారని సబ్ కాంట్రాక్టర్, టీడీపీ నేత సురేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ పనులు నాసిరకంగా ఉన్నాయంటూ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక నాయకులు ఫిర్యాదుతో విచారణ జరిపి బిల్లులు నిలిపివేశారన్నారు. ఆ నివేదికల ఆధారంగానే కూటమి ప్రభుత్వం అప్పట్లో డీఈగా పనిచేసిన కేశవరావుకు మూడు సంవత్సరాల పాటు 15శాతం చొప్పున పింఛను కట్‌చేస్తూ ఉత్తర్వులు ఇవ్వటం శోచనీయమన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే పుల్లారావు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకుండా ఉందన్నారు. 2019 జనవరిలో నిర్మాణం చేసిన ఈ రహదారి ఆరు సంవత్సరాలు గడిచినా చెక్కు చెదర లేదని, నాణ్యతపై విచారణ జరిపి బిల్లులను ఇప్పించి తనకు న్యాయం చేయాలని సురేష్ విజ్ఞప్తి చేశాడు.

గూగుల్ రాకతో విశ్వనగరంగా విశాఖ: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో విశాఖ పెట్టుబడుల గమ్యస్థానంగా మారి విశ్వనగరంగా మారబోతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ భారీ ఏఐ హబ్, డేటా సెంటర్ రాకతో ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నాయకులు నారా లోకేశ్ విశ్వసనీయత, పట్టుదల ఫలితం ఎలా ఉంటుందో మరోసారి నిరూపితమైందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలలలో విశాఖకు రూ.6.50 లక్షల కోట్ల పెట్టుబడులు ఖరారు కావడం హర్షణీయమన్నారు. ఏపీ ప్రభుత్వం తాజాగా గూగుల్‌తో చేసుకున్న ఒప్పందం దేశ సాంకేతిక రంగంలో నూతన విప్లవానికి నాంది పలకనుందని తెలిపారు. గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ లు రాష్ట్ర, దేశ ప్రగతి ప్రస్థానానికి కేంద్ర బిందువులు కానున్నాయని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.32 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్టు గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ ప్రకటించడం హర్షించదగిన విషయమన్నారు.

జీఎస్టీ సంస్కరణలు తెలియజేయడమే ప్రధాని పర్యటన లక్ష్యం

జీఎస్టీ శ్లాబుల తగ్గింపు చారిత్రాత్మక నిర్ణయమని, ఇంత మంచి సంస్కరణల ఫలితాలు ప్రజలందరూ పొందాలన్న సదాశయంతోనే ప్రధాని మోదీ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మోదీ పాల్గొనే బహిరంగసభ ప్రాంగణాన్ని కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

జిల్లా అదనపు న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 13వ అదనపు జిల్లా న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీని పల్నాడు జిల్లా ఎస్పీ బిక్కృష్ణారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని శాంతి భద్రత పరిరక్షణకు, నేరాల అదుపునకు, త్వరితగతిన కేసుల దర్యాప్తు, విచారణ ముగిసేందుకు, నిందితులకు శిక్షలుపడేలా సమర్థవంతంగా పాసిక్యూషన్ నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.